# మరో ప్రజాకర్షక పథకం న్యాయ్ (NYAY)

**లోక్‌సభ** ఎన్నికలకు వెళ్ళటానికి ముందు మోడీ ప్రభుత్వం 5 ఎకరాలు, అంతకులోపు వున్న రైతులకు సంవత్సరానికి 6000 రూ॥ను పెట్టుబడి సాయంగా అందిస్తానని తన చివరి బడ్జెట్‌లో ప్రకటించింది. తెలంగాణా రాష్ట్రప్రభుత్వం ఇదే విధమైన పథకాన్ని అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రవేశపెట్టి అమలుపరిచింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మరికొన్ని ఇతర రాష్ట్రాలు కేంద్రప్రభుత్వ పథకానికి అదనంగా మరికొంత మొత్తాన్ని ప్రకటించాయి.

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెసుపార్టీ తాను అధికారంలోకి వస్తే న్యూనతమ్ ఆదాయ యోజన (NYAY-కనీస ఆదాయ పథకం) పథకం అమలుచేస్తానని ప్రకటించింది. ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ ఇది పేదరికంపై చివరి అస్త్రం అవుతుందని చాలా గట్టిగా చెబుతున్నాడు. ఈ పథకం ప్రకారం, దాదాపు 5 కోట్ల నిరుపేద కుటుంబాలకు సంవత్సరానికి రు.72000 నేరుగా వారి బ్యాంకు ఎకౌంట్లలో జమ చేయబడుతుంది.

ఈ రెండు పథకాలకి, లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక సహాయం అందించే సార్వత్రిక కనీస ఆదాయం(యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం) పథకమే ఆధారం. భారతదేశంలో పేరు ప్రఖ్యాతలు గడించిన ఎంతోమంది ఆర్థికవేత్తలు న్యాయ్ పథకాన్ని పేదలకు కనీస ఆదాయాన్ని స్థిరపరిచే సంక్షేమ పథకంగా కీర్తిస్తున్నారు. నిరుద్యోగ భృతిగానో లేక ఎన్నికల హామీగానో కాక ఈ పథకాన్ని రాజ్యాంగపు హక్కుగాను, సామాజిక భద్రతగాను చూడాలని వారు పేర్కొంటున్నారు.

'న్యాయ్' పథకం అమలుకి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై విస్తృతమైన చర్చ జరుగుతూ వుంది. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ సలహా సంప్రదింపులు జరిపిన ఆర్థికవేత్తలలో రఘురాం రాజన్ కూడా వున్నారని, ఆయన 'న్యాయ్'ని ఆచరణ సాధ్యమైన పథకంగా అంగీకరించాడని రాహుల్‌గాంధీ చెబుతున్నాడు. కానీ చాలామంది న్యాయ్ పథకం ఆర్థికంగా నిలబడలేదని భావిస్తున్నారు. ఎందుకంటే ఈ పథకానికి సంవత్సరానికి 3.6 లక్షలకోట్ల రూపాయలు అవసరమవుతాయి. ఈ పథకం సామాజిక ఒత్తిళ్ళను ప్రేరేపించే అవకాశముందని, అమలు చేయటానికి కష్టసాధ్యమైనదని ప్రొ॥జయతీఘోష్ అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఇస్తున్న అనేక సబ్సిడీలను రద్దుచేస్తేనే ఈ 'న్యాయ్' పథకం అమలు కాగలుగుతుందని ఒక ప్రఖ్యాత ఆర్థికవేత్త అన్నారు. ఆహార ధాన్యాలపై ఇచ్చే సబ్సిడీ, ఎరువులపై ఇచ్చే సబ్సిడీ, పెట్రోలియం ఉత్పత్తులపై ఇచ్చే సబ్సిడీ, జాతీయ ఉపాధిహామీ పథకానికి అయ్యే ఖర్చు, ఎస్.సి., ఎస్.టి. సంక్షేమానికి, ఆవాస యోజన పథకానికి ఇంకా ఇలాంటివే మరికొన్నిటికి అన్నీ కలిపి 5 లక్షల కోట్లు అవుతాయి. వీటన్నిటినీ ఆపేస్తే 'న్యాయ్' ని విజయవంతంగా అమలు చేయవచ్చు. ప్రతి సంవత్సరం బడా పారిశ్రామికవేత్తలకు ఇచ్చే 6 లక్షల కోట్లు గురించి ఈ సందర్భంగా ఎవరూ ప్రస్తావన చేయలేదు. భవిష్యత్తులో ఏం జరగబోతోందనేది జరుగుతున్న ఈ చర్చ తెలియజేస్తోంది.

గత ఏడు దశాబ్దాలలో దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రమవుతూ ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి. విశాల ప్రజాబాహుళ్యం పేదరికం లోనూ, కష్టాలలోనూ మగ్గుతూ ఇది భరించలేని స్థాయికి చేరింది. పేదరికాన్ని తగ్గించే చర్యలుగానీ, నిర్మూలించే చర్యలుగానీ చేపట్టాల్సిన అవసరాన్ని ఎవరూ కాదనరు. ఇది ఎలా చెయ్యాలనేదే ఇప్పుడు ప్రశ్న. వివిధ కాలాల్లో ప్రభుత్వాలు చేపట్టిన పేదరిక నిర్మూలనా చర్యలన్నీ కూడా వాటి లక్ష్యాన్ని చేరుకోవటంలో విఫలమయ్యాయని గత అనుభవాలు తెలియజేస్తున్నాయి.

బ్రిటీషు పాలనాకాలంలో వరదలు, కరువులులాంటి సంక్షోభ సమయాలలో ఉపశమనంగా వేతనంతో కూడిన పనిని కల్పించేవారు. అధికారమార్పిడి అనంతరం కొద్ది దశాబ్దాలు ఇది కొనసాగించబడింది.

వేతనంతో కూడిన పని స్థానే పేదరిక నిర్మూలనా కార్యక్రమంగా శాశ్వత ప్రాతిపదికన ఆదాయ వనరులను కల్పించాలన్న విషయంపై 1960వ దశకం చివర్లో చర్చ సాగింది. తదనంతరమే గరీబీహఠావో నినాదం, ఇందిరాగాంధీ 20 సూత్రాల కార్యక్రమం చోటుచేసుకున్నాయి. ఈ కార్యక్రమం క్రింద లబ్ధిదారులకు మేకలు, ఆవులు, గేదెలు మొదలగునవి అందజేయబడ్డాయి. ఆయా పశువుల పెంపకం ద్వారా వారు ఆదాయాన్ని పొందగలగటం దాని ఉద్దేశం. ఒక దశాబ్దం తర్వాత లబ్ధిదారులను పేదరికం నుండి బయటపడవేయించటంలో ఈ కార్యక్రమం విఫలమైందని అప్పటి ప్రణాళికా విభాగం దీని పనితీరును సమీక్షించి తేల్చింది. పేదరికాన్ని పోగొట్టటానికి మరోదారి వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ వైఫల్యం మరో చర్చకు దారితీసి, వేతనంతో కూడిన పనిని, ఆస్తులను ఏర్పాటుచేయటం రెంటినీ కలిపి పేదరిక నిర్మూలనా కార్యక్రమంగా చేపట్టాలన్న సూచనలు వచ్చాయి. ఇది ఉద్యోగితను హామీ చేసే పథకాల ఏర్పాటుకు దారితీసి చివరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా పరిణామం చెందింది.

మరోవైపు ఆకలితో అలమటిస్తున్న ప్రజలు ప్రభుత్వం సమకూర్చిన ఆస్తులద్వారా ఫలితం పొందేవరకు ఆగాల్సిందేనా, వాళ్ళకు తక్షణం తిండి కావాలి కదా అన్న వాదనల ఫలితంగా వచ్చినవే రెండు రూపాయలకు కిలో బియ్యం, అన్నా క్యాంటిన్లు మొదలగునవి. ఇవి ప్రజల్ని నిరంతరం పాలకులు ఏం విదిలిస్తారా అని ఎదురుచూసే బిచ్చగాళ్ళుగా చేశాయి.

ఒకటి తర్వాత ఒకటిగా వచ్చే ప్రభుత్వాలు తమ పాలనా కాలంలో పేదరికానికి దిగువన ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గిందని తప్పుడు లెక్కలతో ప్రచారం చేసుకున్నా, ప్రజల పేదరికం అత్యున్నత స్థాయికి చేరటమే వాస్తవం. ఇటీవలి జాతీయ

గ్రామీణ ఉపాధిహామీ పథకంతో సహా పేదరిక నిర్మూలనా కార్యక్రమాలేవీ కూడా దేశంలో పేదరికాన్ని పారదోలలేకపోయాయని అధికారిక అధ్యయనాలు కూడా తెలియజేస్తున్నాయి.

ఈ పథకాలు వైఫల్యం చెందటానికి ప్రధాన కారణం అవి భారతదేశంలో పేదరికానికిగల కారణాలను కనీసంగా కూడా తాకకపోవటం. ఈ రోజుకీ దున్నేవానికి తానుదున్నే భూమిపై హక్కు లేదు. దాదాపు 60శాతం సాగుదారులు భూమిహక్కు లేని రైతులే. దున్నేవానికే భూమి ప్రాతిపదికగా భూమి పంపిణీ జరగనంతకాలం భారతదేశంలో అభివృద్ధి వుండదు. అది మాత్రమే ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరిచి వారు గౌరవంగా బ్రతికేట్లు చేయగలదు. మెజారిటీ గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి సరియైన ఉపాధి అనే ప్రత్యామ్నాయం లేకనే నిరుద్యోగులుగా మిగిలి వున్నారు.

దేశంలోని శ్రమజీవులు సృష్టిస్తున్న సంపదనంతా సామ్రాజ్యవాదులు, దేశంలోని పిడికెడు మందిగానున్న బడాబూర్జువాలు దోచుకుంటుంటే, జాతీయ సంపదలో అత్యల్పభాగం మాత్రమే ప్రజలకు చేరుతోంది. సామ్రాజ్యవాద దోపిడి, ఆధిపత్యం, అర్ధఫ్యూడల్ సంబంధాలు భారతదేశంలో పేదరికానికి ప్రధాన కారణాలుగా వున్నాయి. అర్ధఫ్యూడల్ వ్యవస్థ రద్దుకానంతవరకు, దేశంనుండి సామ్రాజ్యవాదాన్ని పారద్రోలనంతవరకు దేశంలో పేదరికం కొనసాగుతూనే వుంటుంది. ప్రజలను కష్టాలకు, దుఃఖాలకు గురిచేస్తూనే వుంటుంది.

౦౦౦౦